ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్లు

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని తాపేశ్వరం శివారు పేకెటిపాకల న్యూకాలనీలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ 11 కెవి వైర్లు చేతికి అంది అంత ఎత్తులోనే ఉండడంతో రైతులు, వ్యవసాయ కూలీలు, స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పొరపాటున విద్యుత్ వైర్లు వైర్ తగిలితే ప్రమాదం సంభవిస్తుందని ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తులో పెట్టడమే కాకుండా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. విద్యుత్ అధికారులు ప్రమాదాలు సంభవించక ముందే తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



చేతికి అందేంత ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు

రైతుకు దక్కని మద్దతు ధర

- ధాన్యం కొనుగోల్లో తేమశాతం, నాణ్యత పేరుతో రైస్ మిల్లర్లు ఇష్టానుసారం రేటులో కోత
- ఆర్‌బికె ద్వారా కాకుండా దళారికే అమ్మకాలు

ప్రజాశక్తి-అమలాపురం

ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్మితే రైతుకు మద్దతు ధర దక్కడం లేదు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పెట్టే నిబంధనలతో రైతు చేసేదేమీ లేక మళ్లీ దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మద్దతు ధర వస్తుందని ధాన్యం ప్రభుత్వానికి అమ్మితే 21 రోజులు కాదు కదా నెలలు గడిచినా ప్రభుత్వం రైతులకు సకాలంలో నగదు చెల్లించడం లేదనీ రైతులు ఆరోపిస్తున్నారు.

రైతు ధాన్యం అమ్మిన నగదు సరైన సమయానికి అందకపోవడంతో ఆ ప్రభావంతో ఖరీఫ్ పంట పెట్టుబడి కూడా ఇబ్బంది అవుతోంది. దీంతో అధిక మంది రైతులు దళారులు వ్యాపారులు పైన మొగ్గు చూపుతున్నారు. దీని ఫలితం రైతులకు మద్దతు ధర కోల్పోవాల్సి వస్తోంది. రైతు పరిస్థితి దయనీయ స్థితిలో ఉంది. గడిచిన ఖరీఫ్ పంటలో మిచౌంగ్ తుపాను ప్రభావంతో అకాల వర్షాలతో జిల్లాలో వేల ఎకరాల్లో చేలోనే పనులు, కల్లాల్లో నే ధాన్యం రాసులు తడిసిపోవడంతో మిల్లర్లు కొనుగోలు చేయకపోవడంతో ఆయన కాడికి దళారులకు అమ్మవలసివచ్చింది. నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తానన్న ఇన్పుట్ సబ్సిడీ క్రాఫ్ డామేజ్ నేటికీ అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి పంటకు పెట్టుబడులు పెట్టి మద్దతు ధర రాక నష్టపోతున్నారు.

7, 58, 908 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 1,71,721 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. జిల్లా మొత్తంలో 7 లక్షల 58 వేల 908 మెట్రిక్ టన్నులు ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా అధికారులు అంచనా వేశారు.

జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్ సంబంధించి ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. నుపూర్ అజయ్ ఇప్పటికే కొనుగోలు కమిటీ సభ్యులకు సూచించారు. ప్రస్తుత రబీ సీజన్లో రామచంద్రపురం ప్రాంతంలో వరి కోతలు ఆరంభమ య్యే సూచనలు ఉన్నాయని, ముందుగా రామచంద్రపురం ఆర్‌బికెల పరిధిలో ధాన్యం కొనుగోలు సంబంధించిన ప్రక్రియను ప్రారంభిం చాల్సివుంటుందన్నారు. ముందుగా ఆ ప్రాంతంలో గోనెసంచులు జిపిఎస్ తో సహా వాహనాలు, అందుబాటు, కొనుగోలు సిబ్బందికి శిక్షణలు వంటి తేమ శాతం కొలిచే పరికరాలను వేయింగ్ మిషన్ లను రైతు భరోసా కేంద్రాల వారిగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేశామని అధికారులు చెబుతున్నారు.



కోనసీమలో ధాన్యం బస్తాలు పట్టుబడి పడుతున్న రైతులు

అమ్మిన రెండు రోజుల్లోనే నగదు చెల్లింపు

జిల్లాలో 389 ఆర్‌బికె ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రబీ పంటకు సంబంధించిన ధాన్యం కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.రైతు ఆర్‌బికె ద్వారా ధాన్యం అమ్మితే 21 రోజులు పూర్తి అయితే గాని ఖాతాలో డబ్బులు జమ కావు. అదే దళారికి అమ్మితే రెండు రోజుల్లోనే నగదు చెల్లించడంతో రైతులు బస్తాకు రూ.100 నుండి రూ.150 రూపాయలు తగ్గినా దళారులకే అమ్మడానికి మొగ్గుచూపుతున్నారు. రైతు కష్టపడి ఆర్‌బికె కేంద్రం ద్వారా ధాన్యం అమ్మిన రైస్ మిల్లుకు తరలించిన తరువాత మిల్లర్లు నాణ్యత లోపం పేరుతో బస్తాకు 2 నుంచి 3 కిలోలు తరుగు వసూలు చేస్తున్నారు. అంతే కాకుండా ధాన్యం తేమ శాతం సరిగా లేదు ధాన్యం నుండి వచ్చే బియ్యంలో నూక శాతం అధికంగా ఉంది అని మరింత రేటు కోసేస్తున్నారు.

ఈ ఇబ్బందుల కంటే దళారికి దాన్యం అమ్ముకోవడమే ఉత్తమమని రైతులు భావిస్తున్నారు.ప్రభుత్వం ఎ గ్రేడ్ ధాన్యం 75 కిలోల బస్తా రూ.1650, సాధారణ రకం 75 కేజీలు బస్తా రూ.1640 రావాలి. కానీ రూ.1350 నుంచి రూ.1450 మధ్య లోనే రైతుల నుంచి దళారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల రైతులు సుమారు రూ.150 నుండి రూ.200 పైగా నష్టపోతున్నారు.

ప్రభుత్వ నిబంధనలు ఇలా.

రైతులు పండించిన ధాన్యం లో మట్టి రాళ్ల చెత్త పొల్లు వంటివి ఒక శాతం మించకుండా ఉండాలని రంగు మారిన మొలకెత్తిన పురుగులు పట్టిన ధాన్యం 5 శాతం మించకూడదని నిబంధనలు ఉన్నాయి. అలాగే రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తప్పనిసరిగా ఇ క్రాప్ నమోదు చేయించుకోవాలి. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా రైతు ధాన్యము కావడానికి వీలులేదు.

అధికారులు ఏం చెబుతున్నారు

రైతు కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర రావాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రం ద్వారానే ధాన్యం కొనుగోలు చేస్తామని తెలుపుతున్నారు. రైతులు దళారులు మధ్యవర్తుల చేతిలో మోసపోకుండా నేరుగా రైతు భరోసా కేంద్రం సంప్రదించి తాము పండించిన పంటకు మద్దతు ధర పొందాలని తెలుపుతున్నారు. ధాన్యం అమ్మిన 21 రోజులలోపు లో రైతు యొక్క ఖాతాలో ప్రభుత్వం నగదు జమ చేస్తుందని వారు తెలిపారు.

తాయిలాల పంపిణీని అరికట్టాలి

కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమలాపురం

ఓటర్లను ప్రలోభ పెట్టి మద్యం, నగదు, బహుమతులు వంటి ఎన్నికల తాయిలాల పంపిణీని అధికారులు అరికట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టి నగదు, మద్యం, బహుమతులు, మాదక ద్రవ్యాల సరఫరాను అరికట్టడానికి నోడల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు. ముఖ్యంగా జిల్లా సరిహద్దులు, చెక్ పోస్ట్ ల వద్ద ముమ్మర తనిఖీలు చేయాల న్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వే లెన్స్ టీముల తనిఖీలు మరింతగా పటిష్టపర్చి నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా రాజకీయ పార్టీలు, లేదా అభ్య ర్థులు ఇంటింటా ప్రచారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సీజర్ మేనేజ్మెంట్ కమిటీ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచిం చారు. బృందాలకు అనుబంధంగా పనిచేస్తున్న అధికారులంతా మరింత చురుగ్గా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు, జిల్లాలో చెక్ పోస్టులు వద్ద సంబంధిత శాఖల అధికారుల పరిశీలన మరింత పెరగాలన్నారు. రైళ్లు, ఆర్‌టిసి బస్సుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలోని చెక్ పోస్టుల వద్ద నియమించిన ప్రత్యేక బృందాలు తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. అనుబంధ శాఖల నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే సీజర్ మేనేజ్మెంట్ విధానం అమలులో సత్ఫలితాలు ఉంటాయన్నారు. రాజకీయ పార్టీల ప్రచారాలు, సమావేశాలు, సభలు, ర్యాలీలపై వీడియో చిత్రీకరణ పక్కాగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థి తులపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని అధికారులకు పలు సూచనలు చేశారు కోడ్ ఉల్లంఘనపై దృష్టి పెట్టి కేసులు నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పోలీస్ అధికారులు, ఎంసిసి బృందాలు, ఇతర ఎన్నికల సిబ్బంది పూర్తి సమన్వయంతో విధులు బాధ్యతలు చేపట్టి ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా సజావుగా ఎన్నికల నిర్వహణకు పరస్పరం సమన్వయంతో మరింత క్రియాశీలంగా వ్యవహరిం చాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కోడ్ ఉల్లంఘన ఘటనలకు స్థానిక అధికారులే బాధ్యత వహించాల్సి చర్యలు తీసు కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించి. ఇంటింటి ప్రచారానికి కూడా అనుమతి ఉండాలని స్పష్టం చేశారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం,

వెదురుమూడి, అచ్యుతాపురం,నిడసనమెట్ట, వడ్లమూరు గ్రామాల్లో మంగళవారం మండపేట రూరల్ సిఐ శ్రీధర్, అంగర ఎస్ఐ అందే పరదేశి ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లోని మెయిన్ రోడ్డులలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్), స్థానిక పోలీసులుతో కలిసి కవాతు జరిపారు. వారు మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో సజావుగా జరగాలని, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



వెదురుమూడిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జీవ శాస్త్రం పరీక్షకు 727 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న టెన్త్ పరీక్షల్లో భాగంగా జీవ శాస్త్రం పరీక్షకు 727 మంది గైర్హాజరైనట్లు డిఇఒ ఎం. కమల కుమారి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 112 కేంద్రాల్లో రెగ్యులర్, ప్రయివేటు విద్యార్థులు 20523 మందికి మంగళవారం 19796 మంది హాజరయ్యారన్నారు. ముమ్మిడివరం మండలంలో రెగ్యులర్ మరియు ప్రయివేటు విద్యార్థులు 733 మందికి 721 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరైనట్లు సంబంధిత విద్యాశాఖాధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 39 కేంద్రాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. **అంబాజీపేట** మండల పరిధి లో మూడు సెంటర్లలో టెన్త్ పరీక్షకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఇఒ-1 కె.వెంకటేశ్వరరావు, ఎంఇఒ-2 మోకా ప్రకాష్ మంగళవారం అంబాజీపేట సెంటర్లో జీవశాస్త్రం పరీక్ష 142 మంది పరీక్ష రాయగా ఒక బాలిక, తొండవరం సెంటర్‌లో 158 మంది పరీక్ష రాయగా ఒక బాలుడు, పుల్లేటికుర్రు సెంటర్లో 186 మంది పరీక్షలు రాయగా ఒక బాలిక గైర్హాజరైందని ఎంఇఒలు తెలిపారు.

విగ్రహ ప్రతిష్టాపనకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -మామిడికుదురు

పెదపట్నంలో నిర్మించిన శ్రీ సీతా రామచంద్ర ఆంజనేయ స్వామి వార్ల విగ్రహప్రతిష్టాపన మహోత్సవాలు ఈ నెల 28వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహక కమిటీ మంగళవారం తెలిపింది. రెండు రోజుల నుంచి పూజలు జరుగుతున్నాయన్నారు 28న విగ్రహ ప్రతిష్టాపన జరుగుతుందని తెలిపారు.

కార్టూ'నిజం'



పలుచోట్ల ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల మంగళవారం ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురికి వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు.

అంబాజీపేట మొసలపల్లి, బివిపాలెం పిహెచ్‌సి సబ్ సెంటర్ వద్ద ముక్కామల పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ జి.రమ్య శైలజ ఆధ్వర్యంలో వైద్యాధికారులు డాక్టర్ చైతన్యకుమార్, డాక్టర్ ఆదిత్య ఎంఎస్ స్పెషలిస్ట్, కంటి వెలుగు ఎండీ హుస్సేన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి రమ్య శైలజ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర సిబ్బంది ధనరాజు, ఎం.రవి కుమార్, సిహెచ్ఒ, సూపర్వైజర్ రాధా నరసింహం, చంటి, ఫార్మసిస్ట్ ,ఏఎన్ఎం, మరియు అశావర్కర్‌లు సేవలందించారు. **ఉప్పలగుప్తం** భీమనపల్లి పంచాయతీ సూదాపాలెం లో మంగళవారం భీమనపల్లి పిహెచసి ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు.శిబిరంలో వైద్యులు కె.విష్ణు ప్రియ, బి.దివ్య రవళి పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.శి బిరంలో అందుతున్న వైద్య సేవలను ఇఒపిఆర్‌డి కెఎస్.గౌరీ కుమారి పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెట్టా నాగేశ్వరరావు, పిహెచ్ సి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



మొసలపల్లిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య సిబ్బంది



సూదాపాలెం లో నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ సురక్ష శిబిరం

రౌడీషీటర్ల కదలికలపై నిఘా: డిఎస్‌పి

ప్రజాశక్తి-మండపేట

రౌడీ షీటర్లు అందరి కదలికలపై నిరంతరం నిఘా కొన సాగుతూ ఉంటుందని రామచంద్రపురం డిఎస్‌పి బి.రామకృష్ణ అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో డిఎస్‌పి ఆధ్వర్యంలో మంగళవారం రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మండపేట సర్కిల్ పరిధిలోని మండపేట టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో నమోదైన రౌడీ షీటర్లకు ఆయా స్టేషన్లో వద్ద వేరువేరుగా కౌన్సిలింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ రౌడీషీటర్లు ఎన్నికల్లో ఏ విధమైన అల్లర్లకు పాల్పడరాదని సూచించారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో వీరందరూ చెడు ప్రవర్తనను మానుకొని, ఎటువంటి గొడవలు, హింసాత్మక ఘటనలలో పాల్గొనరాదని అన్నారు. సత్ప్రవర్తనతో మెలగాలని, లేకపోతే వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ సిఐ అఖిల్ జామ, రూరల్ సిఐ శ్రీధర్, ఎస్ఐలు హరికోటి శాస్త్రి, నాంచారయ్య పాల్గొన్నారు.




రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న డిఎస్‌పి బి.రామకృష్ణ

దేవాంగ సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం (రి) నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవాకం అమలాపురం మండలం బండారులంక లో దేవాంగ గౌరవ సలహాదారులు, గ్రామసంఘాల ప్రతినిధుల సమక్షంలో జరిగింది. సంఘ అధ్యక్షుడు గా అమలాపురం మండల మాజీ అధ్యక్షుడు, వస్త్ర వ్యాపారవేత్త వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని రెండవ సారి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సంఘ ఉపాధ్యక్షులు గా పిచ్చిక శ్యామ్, పిచ్చిక పొలిశెట్టి,ప్రధాన కార్యదర్శిగా పుత్సల వరదరాజులు, కోశాధికారిగా దైవపు నందయ్య, మీడియా కోఆర్డినేటర్‌గా కార్టూనిస్ట్ మాడా రాములను ప్రతినిధులుగా ఎన్నుకున్నారు. చింతా వీరభద్రేశ్వర రావు(మోరి), చింతా శంకరమూర్తి(బండారులంక), అంకం వీర్రాజు(కె. జగన్నదపురం), యక్కల మదన్ మోహన్ (విలసవిల్లి) ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో దేవాంగ పెద్దలు జాన శంకరరావు, బళ్ల వెంకటేశ్వరరావు,చింతపట్ల గంగా సత్యనారాయణ, కాశిన గౌరీ మల్లికార్జునరావు, కామిశెట్టి శ్రీనివాస రావు, జాన గణేష తదితరులు పాల్గొన్నారు.



సంఘం నూతన అధ్యక్షునిగా ఎంపికైన వూటుకూరి

నీటి పొదుపు అందరి కర్తవ్యం

ప్రజాశక్తి ముమ్మిడివరం

మానవ జీవనానికి నీరు ఎంతో ముఖ్యం దానిని పొదుపుగా వాడుకోవడం అందరి కర్తవ్యం అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మరియు పర్యావరణ రాష్ట్ర కన్వీనర్ కెవివి.సత్యనారాయణ అన్నారు. ప్రపంచ జల దినోత్సవ దశ దిన వేడుకల్లో భాగంగా మండలంలోని గేదెలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మంగళవారం ప్రధానోపాధ్యాయుడు విశ్వేశ్వర రావు అధ్యక్షతన జల దినోత్సవం పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిధులుగా పాల్గొన్న జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న జనాభా కు అనుగుణంగా నీటి వనరులను సంరక్షించుకోవాలన్నారు. మరో అతిథి జెవివి.జిల్లా ఉపాధ్యక్షుడు జనిపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టును వడిసి పట్టి బావి తరాలకు అందించాల్సిన కర్తవ్యం యువత పై ఉందన్నారు.నీటిని సంరక్షించుకొని పక్షంలోతీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. అనంతరం మంచినీటి వనరుల అవశ్యకత పై విద్యార్థిని విద్యార్దులకు వకత్వ పోటీలు నిర్వహించగా 11 మంది పాల్గొన్నారు.వీరికి ప్రశంసా పత్రాలను అందించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు కోలా వెంకటేశ్వర రావు సైన్స్ ఉపాధ్యాయుడు పవన్ తో పాటు సహా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జలదినోత్సవంకార్యక్రమంలో జెవివినాయకులు,విద్యార్థినులు తదితరులు

ఉపకరణాల కోసం శిబిరం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అవసరమైన ఉపకరణాలను గుర్తించి అందించేందుకు జిల్లా వ్యాప్తంగా మెడికల్ అసెస్మెంట్ క్యాంప్ లు నిర్వహిస్తున్నట్లు సహిత విద్యా జిల్లా కో ఆర్డినేటర్ ఎంవివి.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్ష పథక సంచాలకుల ఆదేశాల మేరకు జిల్లా సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ ఎ.మధుసూదన రావు నేతత్వంలో ఈ విద్యా సంవత్సరానికి 2023- 24 కు గానూ ఈ నెల 28 నుంచి మెడికల్ అసెస్మెంట్ క్యాంప్ లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 28న రాజోలు జెడ్‌పిహెచ్ఎస్ బాలికల పాఠశాల్లోను, 30 న రావులపాలెం జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాల, ఏప్రిల్ 1న ముమ్మిడివరం జెడ్‌పిహెచ్ఎస్ బాలుర పాఠశాల, 2న రామచంద్రాపురం ఎంఆర్‌సి భవనం లోనూ, 3న అమలాపురం జెడ్‌పిహెచ్ఎస్ బాలికల పాఠశాల్లో ఈ క్యాంప్ లు నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు అనగా 1 నుంచి 8వ తరగతి వరకు ప్రాథమిక స్థాయి, 9 నుంచి 12 తరగతి వరకు సెకండరీ స్థాయి చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన

ప్రజాశక్తి-రామచంద్రపురం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల నియమావళిపై మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీరామచంద్రమూర్తి అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీ, బిఎస్‌పిల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే సివిజన్ యాప్ లో ఫిర్యాదు చేయాలని ఎంపిడిఒ వివరించారు. అదేవిధంగా ఎన్నికలలో డబ్బులు పంపిణీ చేయటం, బహుమతులు పంపిణీ చేయడం, మద్యం పంపిణీ చేయడం, ఓటర్లను తరలించడం తదితర నియమాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. సభలో సమావేశాలకు తప్పనిసరిగా పోలీసులు అనుమతి తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల ప్రతినిధులు ఇఒపిఆర్‌డి సెలెట్ రాజు, ఎఒ సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న ఎంపిడిఒ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

అమలాపురం బిఎస్‌పి ఎంఎల్ఎ అభ్యర్థిగా 'పొలమూరి'

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బిఎస్‌పి ఎంఎల్ఎ అభ్యర్థిగా తనను బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు బి. పరంజ్యోతి ప్రకటించినట్లు సరిపల్లి కి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పొలమూరి మోహన్ బాబు తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు.అమలాపురం నియోజకవర్గంలోని ప్రజా సమస్యలపై పోరాడి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అధ్వానంగా ఉన్న రోడ్లు ఆధునికరించేందుకు కృషి చేస్తానన్నారు. గోడి గురుకుల పాఠ శాలలు, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొని ఉన్న సమస్యలపై పోరాడతానని తెలిపారు. తన గెలుపు కోసం, నియో జకవర్గంలోని యువత, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు కృషి చేయాలని మోహన్ బాబు కోరారు.



పొలమూరిమోహన్‌బాబు

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

వైసిపి మండల అధ్యక్షులు పిన్నమరాజు వెంకట పతి రాజు, సుంకర నాగబాబు ఆధ్వర్యంలో మంగళవారం మురమళ్ల మాణిక్యాలమ్మ ఆలయం వద్ద నుంచి పశువుల్లంక గ్రామాల్లో మంగళవారం ముమ్మిడివరం నియోజకవర్గ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కాటం సత్తిరాజు, రేవు అప్పారావు, మోర్త చిన్నా, మట్టా గగనవీరుడు ఆధ్వర్యంలో పొన్నాడ వెంకట సతీష్ కుమార్ సమక్షంలో పాలెపు దుర్గాప్రసాద్, కాగిత ప్రసాద్, మోర్త రాజుకు వైసిపి కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపిపి మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్‌పిటిసి సభ్యులు ముదునూరి సతీష్ రాజు, ఏలూరి ఆదినారాయణ, చోడిశెట్టి సత్తియ్య నాయుడు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-ఐ.పోలవరం

టిడిపిమండల పార్టీ అధ్యక్షులు రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు ఆధ్వర్యంలో జి.మూలపొలం గ్రామానికి చెందిన దండుప్రోలు సాహెబ్, యర్రగురువు జై భీమ్ నగర్ గ్రామానికి చెందిన 40కుటుంబాలు, గోగుల్లంక నుండి 40కుటుంబాలు, ఎదుర్లంక సర్పంచ్ ముదునూరి పద్మ, కష్టార్జునరాజు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వీరంతా ముమ్మిడివరం నియోజకవర్గం ఉమ్మడి పార్టీల టిడిపి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు, అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ సమక్షంలో టిడిపి కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. గోగుల్లంక, ఎదుర్లంక, పాతఇంజరం, కొమరిగిరి ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, బీర సత్యకుమారి, దాసరి జగదీశ్వరి, సాగిరాజు సూరిబాబు రాజు తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** టిడిపి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో కె.గంగవరం మండలంలోని కూళ్ల పంచాయతీ పరిధిలోని పలువురు పార్టీలో చేరారు. గ్రామ మాజీ సర్పంచ్ పెంకె గోవిందరాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు టిడిపిలో చేరారు. ఆ పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు అన్నింటిని పరిష్కరిస్తానని టిడిపి విజయానికి మీరంతా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చోడి శివ కేశవ్, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు మేడిశెట్టి రవికుమార్, మొర్రాజీ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గోదావరిలో మునిగి యువకుని మృతి

ప్రజాశక్తి - సీతానగరం

గోదావరిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తూ మునిగిపోవడంతో యువకుడు మృతి చెందాడు. మంగళవారం రఘుదేవపురం వద్దీపేటలో ఈ ఘటన చోటు చేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లా పోలవరం గ్రామానికి చెందిన గోపాల శివశంకర్ (21) తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురంలో వద్దీపేటలో బంధువుల ఇంటికి వచ్చాడు. మంగళవారం మధ్యాహ్నం భోజనం అనంతరం ముగ్గురు స్నేహితులతో కలిసి ముగ్గుల గోదావరి రేవుకి స్నానానికి వెళ్లారు. స్నానం చేస్తూ శివ శంకర్ ప్రమాదవశాత్తూ గోదావరిలో మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీతానగరం ఎస్ఐ రామకృష్ణ మకాన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మిల్క్ డెయిరీలో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

నగరంలోని లక్ష్మీ గణేష్ మిల్క్ డెయిరీలో విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాల నమూనాలను సేకరించారు. ధ్రువీకరించని కాటా, ప్యాకింగ్ లైసెన్స్ లేకపోవడం, పెరుగు బకెట్లపై సంరక్షణ వివరాలు లేకపోవడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు 3 కేసులు నమోదు చేశారు. 4 డొమెస్టిక్ సిలిండర్లను గుర్తించి 6ఎ కేసు నమోదు చేశారు. రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎఎస్‌పి ఎస్.సుబ్బారెడ్డి మాట్లాడుతూ నెయ్యి, నూనె మొదలనవి అనుమతులు లేకుండా తయారు చేసినా, అమ్మకాలు నిర్వహించినా చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాలు నాయుడు, నాగ వెంకట రాజు, జగన్నాథరెడ్డి, మహేష్, నవీన్ కుమార్, లీగల్ మెట్రాలజీ అధికారి బాలాజీ, ఫుడ్ సేఫ్టీ అధికారి రత్తయ్య, జీవానందం, శివ పాల్గొన్నారు .

రూ.4 లక్షల స్వాధీనం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని జగన్నాథపురం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద తనిఖీల్లో భాగంగా కారులో తరలిస్తున్న రూ.4 లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి ఆధారాలు చూపని కారణంగా నగదును సీజ్ చేశామని ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు.

11 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం డివిజన్ పరిధిలోని 11 మందిపై బైండోవర్ కేసులు నమోదయ్యాయని ఆర్‌డిఒ సుధాసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో వారి నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షల చొప్పున వ్యక్తిగత పూచి కత్తులు తీసుకున్నామని వెల్లడించారు. రామచంద్రపురం సిఐ పి.దొరరాజు మాట్లాడుతూ ఎన్నికల్లో ఏ విధమైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడమని వాటిని ఉల్లంఘించిన వారు రూ.5 లక్షల సొమ్ము చెల్లించవలసి వస్తుందన్నారు.

50 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని లంక పరివాహక గ్రామాలలో నాటు సారాను నిర్మూలించేందుకు ఎస్ఐ ఎస్.శ్రీనివాసు దాడులు నిర్వహించారు. మంగళవారం వెలిచేరు, యుజి పాలెం శివారున నాటు సారాను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 50 లీటర్ల నాటు సారాను స్వాధీన చేసుకున్నారు. ఈ దాడిలో నిందితుడు దుర్గారావు పరారయ్యాడని,త్వరలోనే పట్టుకుని అరెస్టు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

అదనపుకట్నంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అదనపు కట్నం తేవాలంటూ తరచూ భార్యను వేధిస్తున్న భర్త, అత్తమామలు, ఆడపడుచులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆత్రేయపురం గ్రామానికి చెందిన ఎలమర్తి లక్ష్మీ భవానికి పశ్చిమగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావు పాలెంకు చెందిన ఎలమర్తి వెంకటశివ ఫణీంద్రసాయితో 2022లో వివాహం అయ్యింది. పెళ్లి సమయంలో కట్న కానుకలతోపాటు లాంఛనాలతో కాపురానికి పంపించారు. వీరి కాపురం కొన్నాళ్ల సజావుగాని సాగింది. ఇటీవల కాలంలో భర్త ఫణీంద్రసాయి చెడు వ్యసనాలకు బానిసై భార్యను అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్నాడు. దీనికి అత్తమామలు, ఆడపడుచు వత్తాసుపలుకడంతో లక్ష్మీ భవాని మంగళవారం పోలీసులను ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు

పేరవరంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని పేరవరం గ్రామంలో మంగళవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలు ప్రకారం..గ్రామానికి చెందిన రైతు ఉందుర్తి వీర్రాజు చెత్తకు నిప్పు పెట్టాడు. ఆ మంటలు వెదురు చెట్లుకు అంటుకుని పూర్తిగా దగ్ధమవడంతోపాటు, పక్కనే ఉన్న ఆరు కొబ్బరి చెట్లు దహనం అయ్యాయి. రూ.10 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని కొత్తపేట ఫైర్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ అధికారి కె.రాంప్రసాద్ తన సిబ్బంది సకాలంలో వచ్చి మంటలను అదుపు చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎన్నికలు కీలకం

ప్రజాశక్తి-అమలాపురం

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎన్నికలనేవి కీలకమైన అంశమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి భవన్ నందు 21 శాఖలకు సంబంధించి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు సాధారణ ఎన్నికలు-2024 కు సంబంధించి పోలింగ్ ప్రక్రియ నిర్వహణ తీరు పట్ల పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ మరియు అవగాహనను పెంపొందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ తీరు పట్ల ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించి చాలని సూచించారు. రిసెప్షన్ సెంటర్ పోలింగ్ రోజుకు ముందు రోజు ఉదయం 10 గంటలకు తప్పని సరిగా పోలింగ్ సిబ్బంది హాజరు అవ్వాలని, ముఖ్యమైన ఎన్నికల సామగ్రి 56 అంశాలకు సంబంధించి బృంద సభ్యులు తీసకొని లోటుపాట్లు ఉన్నది లేనిది పర్యవేక్షించుకోవాలన్నారు. సెక్టార్ అధికారి మార్గదర్శకంలో కేటాయిం చిన పోలింగ్ కేంద్రాలు చేరుకుని పోలింగ్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఎటువంటి ప్రచార కార్యక్ర మాలు బ్యానర్లు జెండాలు లేకుండా మార్కింగ్ విఆర్వో సహాయంతో చేపట్టాలన్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రం స్థితిగతులకు అనుగుణంగా పోలింగ్ నిర్వహణ కొరకు రహస్య ఓటింగ్ కంపార్ట్మెంట్ మరియు లోపలికి బయటికి మార్గాలు సక్రమంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన పిదప సమయం ఉండద కావున ముందుగానే చట్టబద్దంగా కవర్లు చట్టబద్ధం కాని కవర్లను ముందుగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఆ రాత్రికి సిబ్బంది అంతా పోలింగ్ కేంద్రం లోనే బస చేయాలని ఉదయాన్నే ఐదున్నర గంటలకు అంతా సిద్ధం చేసుకుని మాక్ పోలింగ్ నిర్వహణకు సిద్ధం కావాలన్నారు. పోలిం గ్కు 90 నిమిషాలు ముందు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ 50 ఓట్లతో నిర్వహించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు పనితీరును పరిశీలన చేసుకొని మాక్ పోలింగ్ ఓట్లను తొలగించి, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు ఓటింగ్ ప్రారంభోత్సవానికి సిద్ధం చేసి తదుపరి ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రక్రియను తప్పనిసరిగా ప్రారంభిం చాలన్నారు. పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సిబ్బందితో పాటు సూక్ష్మ పరిశీల కులు పర్యవేక్షణలో వెబ్ కాస్టింగ్ చిత్రీకరణతో పోలింగ్ ప్రక్రి య నిర్వహిస్తారన్నారు. పోలింగ్ కేంద్రంలో ముందుగా పోలింగ్ ఆఫీసర్ (ప్రిసైడింగ్ అధికారి) ఓటర్ స్లిప్పును ఓటర్ ఎపిక్ లేదా 12 రకాల గుర్తింపు కార్డులలో ఒక కార్డును ధ్రువీకరించి సంతప్తి చెంది ఓటింగ్ కొరకు అనుమతిస్తారని అన్నారు. మూడో పోలింగ్ అధికారి పార్లమెంటుకు తెలుపు, అసెంబ్లీకి పింక్ కలరు బ్యాలెట్ స్లిప్పులను జారీ చేస్తారని వీటి వెనుక ఓటర్ ఎపిక్ లేదా గుర్తింపు కార్డు సీరియల్ నెంబరు వేస్తా రన్నారు. నాలుగో పోలింగ్ అధికారి పార్లమెంట్ ఓటింగ్ కంపార్ట్మెంట్టు, కంట్రోల్ యూనిట్టు ఇన్చార్జిగా వ్యవహా రించి ఓటింగ్కు అనుమ తిస్తారని ఆయన తెలిపారు ఐదో పోలింగ్ అధికారి ఓటింగ్ కంపార్ట్మెంట్టు ఇన్చార్జిగా వ్యవహా రించి ఓటు హక్కును కల్పిస్తారన్నా రు. డిఆర్ఓ ఎం. వెంకటే శ్వర్లు మాట్లాడుతూ పోలింగ్ కు వారం రోజులు ముందుగా అత్యవసర సర్వీసులు పోలింగ్ నిర్వహణలో ఉన్న ఉద్యోగులు, ఎన్నికల మీడియా కవరేజ్లో నిమగ్నమైన గుర్తింపు పొందిన పాత్రికేయులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించు కోవచ్చునని, బ్యాలెట్ ఓటింగ్ నిమిత్తం ఫామ్ 12 ధ్రువీకర ణ కొరకు గెజిటెడ్ అధికారిని స్థాని కంగా ఏర్పాటు చేస్తారన్నారు. రహస్య ఓటింగ్ గోప్యతను కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, సిపిఒ వెంకటేశ్వర్లు పవర్ పాయి ంట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి అవగా హనను ఇవిఎంల డెమో ద్వారా కూడా అవగా హనను భౌతికంగా కల్పించారు. మాస్టర్ ట్రయినీలు ప్రకాష్ తది తరు లు పాల్గొన్నారు.



పోలింగ్ యంత్రాలపై శిక్షణ ఇస్తున్న అధికారులు

మెజిస్ట్రేట్‌కు బాధితుని కృతజ్ఞతలు

ప్రజాశక్తి- ముమ్మిడివరం

మతిస్థిమితంతో బాధపడే వ్యక్తికి మెరుగైన వైద్యం అందించేలా చేయడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దేందుకు ఆదేశించిన మెజిస్ట్రేట్ కు బాధితుడు మరియు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.వివరాల ప్రకారం ముమ్మిడివరం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు పరిధిలోని ఐ.పోలవరం మండలం కేశన కుర్రు పెదలంక కు చెందిన జనిపల్లి గోపి మతి స్థిమితం(మానసిక స్థితి) సక్రమంగా లేక పిచ్చివానిగా ప్రవర్తిస్తూ కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారితో నిత్యం గొడవలు పడేవాడు, అంతే కాకుండా మహిళలు, స్కూల్ కి వెళ్ళే పిల్లలు, వాహన దారులను రాళ్లతో కొడుతూ ఇబ్బందులకు గురి చేసేవాడు. ఈ విషయం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ దృష్టికి వచ్చింది. ఛైర్మన్ స్పందించి మతి స్థిమితం లేని వ్యక్తిని పోలీసుల ద్వారా ముమ్మిడివరం పిహెచ్‌సికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వైద్యులు పరీక్షించి మతి స్థిమితం(మానసిక స్థితి) లేని వ్యక్తిని విశాఖలోని మెంటల్ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించారు. చర్యలు తీసుకున్నారు. వైద్యులు గోపి పూర్తిగా కోలుకున్నట్లు నిర్ధారించి, ఆసుపత్రి నుంచి విడుదల చేశారు. డిశ్చార్జ్ అయిన గోపీని మంగళవారం లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ ఎదుట ప్రవేశ పెట్టగా వైద్యుల నివేదికను మెజిస్ట్రేట్ మహమ్మద్ రహంతుల్లా కు అందజేశారు. పూర్తి ఆరోగ్యంతో ఉన్న గోపీని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



మెజిస్ట్రేట్ రహంతుల్లాకు కృతజ్ఞతలు తెలుపుతున్న గోపి

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

▸ మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్

ప్రజాశక్తి-మండపేట

రాయవరం మండలంలో రాయవరం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలుపై మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ మాట్లాడుతూ మండలంలో 14447 ఎకరాలలో వరి సాగు చేయడం జరిగిందని 55 వేల మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా వేశామన్నారు. మద్దతు ధర సాధారణ రకానికి 75 కేజీలు బస్తాకు రూ.1637 అదేవిధంగా గ్రేడ్ ఏ రకాలకు రూ.1652 ధాన్యం కొనుగోలు కేంద్రాల త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవలంబించవలసిన విధులు వివరించారు. గ్రామ వ్యవసాయ సహాయికులు రైతు భరోసా కేంద్ర పరిధిలో రైతులకు మద్దతు ధరపై అవగాహన కల్పిస్తూ మద్దతు ధర పొందే విధంగా వాటి నాణ్యత ప్రమాణాలను ఏ విధంగా ఉండాలి అనే దానిపైన అవగాహన కల్పించాలని ఆదేశాలను జారీచేశారు. మద్దతు ధర పొందాలి అంటే తప్పనిసరిగా తేమ శాతం 17 శాతం లోపుగా ఉండే విధంగా చూసుకోవాలి. గ్రామ రెవెన్యూ అధికారులను కస్టోరియన్ అధికారులుగా రైస్ మిల్‌కు నియమి స్తామన్నారు. వారు వచ్చిన ప్రతి ధాన్యపు లోడును త్వరితగతిన దిగుమతి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, దీనితోపాటు మిల్ గేట్ వద్ద జియో కోఆర్డినేట్స్ ఫిక్స్ చేసి మార్కింగ్ చేయాలన్నారు. దీని ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి వచ్చిన టు వంటి లోడు మిల్ గేట్ దాటి లోప లికి వెళ్లినప్పుడు ట్రిప్ క్లోజ్ అవుతుందన్నారు. మండల తహశీల్దార్ ఆర్‌వి.కష్ణారావు మాట్లాడుతూ ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో గోను సంచులు ముందుగానే ఏర్పాటు చేయాలని గ్రామ రెవెన్యూ అధికారులకు సూచించారు. వ్యవసాయ, రెవెన్యూ, సొసైటీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సియస్‌డిటి ఎలీషా, డిప్యూటీ తహశీల్దార్ జానకి రామయ్య తదితరుల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ ప్రభాకర్

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ప్రజాశక్తి-మండపేట

నిబంధనలను పాటించకుంటే చర్యలు తప్పవని పట్టణ సిఐ షేక్ అఖిల్ జమ, ఎస్ఐ హరికోటి శాస్త్రి అన్నారు. ఎన్నికల నిబంధన మేరకు రాత్రి 10 తర్వాత తెరిచి ఉంచిన దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం రాత్రి వారు సిబ్బందితో కలిసి పట్టణ పరిధిలో కలువ పువ్వు సెంటర్, రాజారత్న జంక్షన్ లలో సోమవారం రాత్రి గస్తీ నిర్వహించారు. రాత్రి పది తర్వాత తిరిగే వాహన దారులకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పిం చారు. రాజారత్న జంక్షన్ సమీపంలో ఒక పాన్ షాప్ తెరిచి ఉండడంపై అక్కడికి వెళ్లి షాపును పరిశీలించి రా త్రి పది తర్వాత షాపు తెరిచిఉంచితే కేసులు నమోదుచేస్తామన్నారు.

85 శాతం హామీలను తుంగలో తొక్కిన జగన్ సర్కార్

ప్రజాశక్తి-కొత్తపేట

హామీలను అడ్డుపెట్టుకుని అధికారం చేపట్టిన జగన్ సర్కార్ అయిదేళ్లు పూర్తికావస్తున్నా వాటిపై దృష్టి సారించక 85 శాతం హామీలను తుంగలో తొక్కారని కొత్తపేట నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేటలోని బండారు బులిసత్యం చంద్రవతి కాపు కళ్యాణ మండపంలో మంగళవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో సత్యానందరావు మాట్లాడారు. మద్య నిషేధం చేసి ఓట్లు అడుగుతానన్న సిఎం జగన్ ఆ హామీని ఎందుకు నెరవేర్చలేదో చెప్పాలని ప్రశించారు. కరెంటు చార్జీలు తగ్గిస్తామని ఇచ్చిన హామీ అటుంచితే 9 సార్లు చార్జీలు పెంచి ప్రజలకు షాక్ కొట్టేలా చేశారని అన్నారు 2.30 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేయడమే కాకుండా మెగా డిఎస్‌సి అని దాన్ని దగా డిఎస్‌సిగా మార్చారని దుయ్యబట్టారు. ఇసుక విధానాన్ని మారుస్తామని చెప్పి ఇసుకను అక్రమంగా దోచుకున్నారని ఆరోపించారు. 25 లక్షల ఇళ్ల నిర్మాణం చేస్తామని మాట ఇచ్చి మడమ తిప్పారని తెలిపారు. ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి వారికి సమయానికి జీతాలు కూడా ఇచ్చే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారని రకాలుగా దోపిడీ చేశారాన్నరు. ఇలా అన్ని వర్గాల వారిని మోసం చేసిన జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు ప్రజలంతా సంసిద్ధులు కావాలని సత్యానందరావు కోరారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

వేసవిలో తాగునీటి సమస్య తలెత్త కుండా సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. మంగళ వారం కలెక్టరేట్‌లో వేసవి తాగునీటి సరఫరా ప్రణాళికపై గ్రామీణ నీటి సరఫరా, మునిసిపల్, పంచాయతీ, ఇరిగేషన్, వ్యవసాయం, పొల్యూషన్, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎట్టిపరిస్థి తుల్లోనూ తాగునీటి సమస్యలు తలెత్తకూండా చూడా లన్నారు. జిల్లాలో ప్రస్తుత అవసరాలకు ఇబ్బంది లేకుండా చూస్తూ కాంప్రెహెన్సివ్ ప్రొటెక్టెడ్ వాటర్ సప్లయ్, పైప్‌లైన్ వాటర్ సప్లయ్ పథకాలకు సంబంధించిన 22 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తి స్థాయిలో నింపేలా కార్యాచరణ అమలుచేయాలని ఆదేశించారు.

పోలింగ్ బూత్‌ల నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - పెద్దాపురం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ స్టేషన్ల వద్ద ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు ఎంసిసి కన్వీనర్, ఎంపిడిఒ జి.ఉషారాణి అన్నారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని వాలు తిమ్మాపురం, కొండపల్లి, ఆనూరు, చిన్న బ్రహ్మదేవం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్‌లకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్తు, ర్యాంపులు, మరుగుదొడ్లు ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఏ గ్రామంలోనూ రాజకీయ పార్టీల, నాయకుల స్టిక్కర్లు పోస్టర్లు ఉంటే తొలగించాలన్నారు. పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఆమె పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీల కార్యదర్శులు వరసాల శ్రీనివాస్, తృలికి దొరబాబు, శ్యామల, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.